క్లుప్తంగా

విధుల్లో అప్రమత్తంగా ఉండండి



విజయవాడ స్పోర్ట్స్: సంఘ వ్యతిరేక శక్తుల కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంటెలిజెన్స్ సిబ్బందికి జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా సూచించారు. ఏలూరు డీటీసీ కార్యాలయంలో నిర్వహించిన ఇంటెలిజెన్స్ శిక్షణ తరగతులకు జిల్లాలోని పలువురు సిబ్బంది, అధికారులు హాజరయ్యారు. ఈ శిక్షణ తరగతులకు వెళ్లిన సిబ్బంది వారు తయారు చేసిన పలు ఐఈడీ నమూనాలను స్థానిక బందరు రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్‌లో గురువారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీపీ రాణా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించేందుకు చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. బాంబ్ డిస్పోజల్ టీంలోకి మొట్టమొదటి సారిగా ఎనిమిది మంది మహిళలు చేరడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. ఐఎస్‌డబ్ల్యూ రిటైర్డ్ ఐజీపీ శశిధర్‌రెడ్డి, సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సి.హెచ్.అప్పలనాయుడు, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీలు సూర్యభాస్కరరెడ్డి, సుబ్రహ్మణ్యస్వామి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు



విజయవాడ స్పోర్ట్స్:ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఈ నెల 22వ తేదీన నిర్వహించే కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్షను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు తెలిపారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రశ్నాపత్రాలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంను డీసీపీ గురువారం పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లాలోని పరీక్షా కేంద్రాలకు తరలించే ప్రశ్నాపత్రాలను ఇక్కడ భద్రపర్చినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూం వద్ద ఉన్న సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా కంచికచర్ల పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను డీసీపీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అక్కడున్న ఆర్మ్‌డ్ పోలీసులను ఆమె ఆదేశించారు.

ఎల్‌ఐసీని ప్రైవేటీకరిస్తే దేశంపై ఆర్థిక భారం



గాంధీనగర్(విజయవాడపశ్చిమ):ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసీని ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్న కేంద్రం ఇప్పటికైనా తన ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి ఎస్ఎంకె ప్రసాద్ అన్నారు. ఎల్‌ఐసీని ప్రైవేటీకరణ చేస్తే దేశంపై ఆర్థిక భారం పడుతుందని హెచ్చరించారు. 1956 జనవరి 19న నాటి కేంద్ర ప్రభుత్వం 245 ప్రైవేట్ కంపెనీలను జాతీయం చేస్తూ ఆర్డినెన్స్ ప్రకటించిన రోజును పురస్కరించుకుని 'ప్రజల ధనం.. ప్రజల కోసమే' అన్న నినాదంతో భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల రెండు ఎల్‌ఐసీ కార్యాలయాల్లో గురువారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 67 ఏళ్లగా ప్రజల విశ్వాసాన్ని పొంది ప్రతి ఏడాది సుమారుగా రూ.31 వేల కోట్లను డివిడెండ్‌గా ప్రభుత్వానికి చెల్లిస్తుందని అన్నారు. ఐసీఈయు అధ్యక్షులు వీవీఎస్ఎస్ సాయి, ఆర్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శులు గుర్రం శ్రీనివాస్, రాజశేఖర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి గాయాలపాలైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామలింగేశ్వరనగర్, పడవలరేవు వంతెన వద్ద నివాసం ఉంటున్న బోగిరెడ్డి నాగరాజు అలియాస్ నాగూల్‌మీరా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో ఎం హోటల్ వైపు నుంచి అమెరికన్ హాస్పిటల్ వైపు జాతీయ రహదారి దాటుతున్నాడు. ఆ సమయంలో రేపల్లె నుంచి బస్టాండ్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆయన కిందపడిపోయి గాయపడ్డాడు. సమీపంలోని వారు బాధితుడిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు.

జగనన్న హయాంలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న హయాంలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 32 వ డివిజన్ 229 వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్ పాల్, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలానే ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మురుగుకాల్వల్లో ఎప్పటికప్పుడు పూడికను తొలగించాలని అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చటంతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలుచేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన తన పాలనతో అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఎన్టీఆర్ పేరు ఎత్తే అర్హత టీడీపీకు లేదు...

అధికారం కోసం సొంత మామ ఎన్టీఆర్‌ను మానసిక క్షోభకు గురిచేసిన చంద్రబాబుకు ఎన్టీఆర్ పేరు ఉచ్ఛరించే అర్హత లేదని మల్లాది విష్ణు అన్నారు. అధికారం లేనప్పుడు మాత్రమే చంద్రబాబుకు ఎన్టీఆర్ గుర్తుకు వస్తారన్నారు. ఎన్టీఆర్ కష్టపడి స్థాపించిన పార్టీని లాక్కుని, చివరకు ఆ మహనీయుని మరణానికి కారకుడయ్యారని గుర్తుచేశారు. అటువంటి నమ్మకద్రోహి నాయకత్వంలో పనిచేస్తున్న తెలుగుదేశం నేతలకు ఎన్టీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టి.. ఆయనపై సీఎం వైఎస్ జగన్ తన గౌరవాన్ని చాటారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలి

గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డినేటర్ కందుల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకే జేసీఎస్ కన్వీనర్లను నియమిస్తున్నట్లు గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డి నేటర్ కందుల రవీంద్రరెడ్డి తెలిపారు. కింది స్థాయి కార్యకర్త నుంచి నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంబంధాలు కలిగి ఉంటారన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు, గృహ సారథులు, ప్రజలకు మధ్య జేసీఎస్ మండల కన్వీనర్లు వారధుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి జగనన్న సచివాలయ కన్వీనర్ (జేసీఎస్) సమావేశం జరిగింది. గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డి నేటర్ కందుల రవీంద్రరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, మొండితోక అరుణ్‌కుమార్, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త దేవినేని అవినాష్, ఆర్జీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్(బుడ్డి), సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కొడవకల్లు నరసింహారావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నూతనంగా నియమితులైన జేసీఎస్ కన్వీనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జేసీఎస్ కన్వీనర్ల విధులను వివరించారు. వలంటీర్లు, గృహ సారథులతో కలిసి సమన్వయంగా జేసీఎస్ మండల కన్వీనర్లు ముందుకు సాగాలన్నారు. జేసీఎస్ కన్వీనర్లు వారికి కేటాయించిన ప్రతి పనిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి అంశంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమాచారాన్ని అందిపుచ్చుకుంటూ పార్టీ ఆదేశాలను స్పష్టంగా పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి నుంచి వచ్చే సమాచారాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత జేసీఎస్ కన్వీనర్లపై ఉందన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్లపై గురుతర బాధ్యతను పెట్టారన్నారు. గృహ సారథుల నియామకంలో జేసీఎస్ కన్వీనర్లు ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని కోరారు. అందరినీ కలుపుకుని, ప్రతి అంశాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో మన పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న జగనన్న సచివాలయ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సమాజానికి వేమన పద్యాలు దిక్సూచి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): యోగి వేమన పద్యాలు సమాజానికి దిక్సూచి లాంటివని ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు తెలిపారు. ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం 75 సంవత్సరాల వజ్రోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం వేమన జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్పొరేటర్ పెనుమత్స శిరీష, శర్వాణీ మూర్తితో కలసి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు వేమన పద్యాలను పఠిస్తూ అందులోని భావాలను అనుసరించాలని సూచించారు. 75 సంవత్సరాలుగా అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయంతో పాటు సేవాకార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. కార్పొరేటర్ పెనుమత్స శిరీష, శర్వాణీ మూర్తి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు మాట్లాడుతూ తాము సామాజిక బాధ్యతగా ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగర పాలక సంస్థ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతులమీదుగా ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. తొలుత విద్యార్థులు వేమన పద్యాలను ఆలపించారు. మాజీ డిప్యూటీ మేయర్ ఎస్.నరసరాజు, శాగి భగవాన్‌రాజు, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరరాజు, డీజేపీఎస్ రాజు, ప్రసాదరాజు, డాక్టర్ ఎస్ వీ సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సామంతపూడి చిన్నా, పట్టాభిరామరాజు తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు



విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మల్లాది విష్ణు

యోగి వేమన గొప్ప తత్వవేత్త

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):యోగి వేమన గొప్ప తత్వవేత్త అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గురువారం యోగి వేమన జయంతి నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేమన స్వచ్ఛమైన తెలుగులో ఆటవెలది పద్యాలను అందరి నోట అవలీలగా పలికేలా వేల పద్యాలను రచించారని చెప్పారు. సమాజంలోని అనేక సంఘటనల మీద , మూఢ నమ్మకాల పైన అంకుశం లాంటి పద్యాలను రచించి ప్రజలను చైతన్య వంతులను చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన పద్యాలను లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. లోతైన జ్ఞానం , సామాజిక అంశాలు పద్యాలలో పొందుపరిచారని పేర్కొన్నారు. ఇన్నాళ్లు ఏ ప్రభుత్వం ఆయనకు సరైన గుర్తింపునివ్వలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేమన జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి వేమన పద్యాలను నేర్చుకోవాలని కోరారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది దాసి రమేష్, కె.రాంబాబు , జె.శంకర్, గోపాలరావు, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జమల పూర్ణమ్మ

గ్రంథాలయంలో యోగి వేమన జయంతి

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో గురువారం యోగి వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగి వేమన ప్రజా కవి, గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా సాధారణ వ్యక్తులకు సైతం అర్థమయ్యే భాషలో తన కవితా రచనలతో మెప్పించారని చెప్పారు. ఆయనకు దక్కిన గౌవరం మరే ఇతర కవులకు లభించలేదన్నారు. ఐక్యరాజ్య సమితి–యునెస్కో వారు యోగి వేమనను ఎన్నుకుని ఆయన రచనలను పలు భాషల్లోకి అనువదింపచేశారని తెలిపారు. అటువంటి మహనీయుడిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

సామాజిక సంఘ సంస్కర్త వేమన

విజయవాడ స్పోర్ట్స్:పద్యాలతో సమాజంలోని మూఢాచారాల నిర్మూలనకు యోగి వేమన కృషి చేశారని అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. యోగి వేమన జయంతి జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో గురువారం నిర్వహించారు. యోగి వేమన చిత్ర పటానికి సత్తిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరళమైన భాషలో పద్యాలను ఆలపిస్తూ యోగి వేమన సామాజిక విప్లవానికి నాంది పలికిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రజాకవిగా వేమన గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అలాంటి మహనీయుడి జయంతిని రాష్ట్ర వేడుకగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. వేమనను భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యాలయ ఏవో రంగారావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీపీ సత్తిబాబు

విద్యార్థులకు యోగి వేమన పద్య పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):యోగి వేమన జయంతి సందర్భంగా మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో విద్యార్థులకు వేమన పద్య పోటీలు నిర్వహించారు. పోటీలలో అక్కమ్మ, శిరీష, కెజియా విజేతలుగా నిలిచారు. విజేతలకు వేమన ఫౌండేషన్ ఆధ్వర్యాన జ్ఞాపిక, ప్రశంసాపత్రం, పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ యోగి వేమన చేసిన సేవలను వివరించారు. అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

కేంద్ర ప్రభుత్వానికి కేసన డిమాండ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బలహీనవర్గాలు అభ్యున్నతి చెందాలంటే కేంద్ర ప్రభుత్వం బీపీ మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని తమ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 1977లో జనతా పార్టీ ఎన్నికల్లో విజయం సాధిస్తే బీసీల సామాజిక, రాజకీయ, సంక్షేమ, సమగ్ర అభివృద్ధి కోసం ఒక కమిషన్ వేస్తామన్న ఎన్నికల వాగ్దానం మేరకు నలుగురు సభ్యులతో బీపీ మండల్ చైర్మన్‌గా మండల్ కమిషన్ వేసినట్లు తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా 11 సూచికల ఆధారంగా బీసీల వెనుకబాటు తనాన్ని గుర్తించేందుకు రెండేళ్ల పాటు, సుమారు 406 జిల్లాల్లో పర్యటనలు జరిపి అద్వితీయమైన రిపోర్టును డిసెంబరు 31, 1980లో నాటి ప్రధాని ఇందిరాగాంధీకి ఇచ్చినట్లు తెలిపారు. ఆ రిపోర్టును పదేళ్లు అటకెక్కించగా, మళ్లీ 1989లో వీపీ సింగ్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరుగున పడిన మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు పార్లమెంటులో ప్రకటన చేసినట్లు తెలిపారు. మండల్ కమిషన్ చేసిన సిఫార్సులన్నింటినీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్కాపురం కనకారావు, ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, నాయకులు దాసరి కేశవరావు, యువజన ఉపాధ్యక్షుడు జి.ద్వారకాశ్రీను, చిప్పాడ చందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసన శంకరరావు, ఇతర ప్రతినిధులు

గంటల వ్యవధిలో ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గాపురానికి చెందిన జొన్నవిత్తుల ఉదయభాస్కర్‌కు గంటల వ్యవధిలో ఆరోగ్యశ్రీకార్డును గురువారం కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి చేతులమీదుగా అందజేశారు. ఉదయ భాస్కర్ వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు ప్రైవేటు హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. అయితే చిరుద్యోగి అయ్యిన ఉదయ్ భాస్కర్ ప్రైవేటు ఆసుపత్రిలో ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవటం వల్ల ఫీజులు చెల్లించాలని ఆసుపత్రి వర్గాలు తేల్చిచెప్పాయి. సమాచారం అందుకున్న కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి గంటల వ్యవధిలో ఆరోగ్యశ్రీ కార్డును మంజూరు చేయించారు. మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డును కార్పొరేటర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు తమ కుటుంబాన్ని కాపాడిందన్నారు. తాము ఊహించని విధంగా గంటల వ్యవధిలోనే ఆరోగ్యశ్రీ కార్డు తమకు అందించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరికు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): సినీ నటుడు, వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత అలీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడు పోతిన మహేష్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ గురువారం ఒక ప్రకటలో డిమాండ్ చేశాడు. బీజేపీతో అంటకాగుతూ ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉన్న జనసేన నేతలకు మైనార్టీలంటే చిన్నచూపుతో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ మైనార్టీ నాయకుడు అలీ పవన్ కళ్యాణ్‌పై పోటీ చేస్తానని ప్రకటిస్తే అందులో తప్పేముందని ప్రశ్నించారు. దానికి అలీ బఫూన్ అంటు జనసేనా నాయకుడు పోతిన మహేష్ నోటికి వచ్చినట్లు మాట్లాడి మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాష్ట్రంలో మైనార్టీలకు పెద్ద పీట వేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనా పార్టీ ఒక్క మైనార్టీకి కూడా సీటు ఇవ్వలేదని తెలిపారు. మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, పోతిన మహేష్ నోరు అదుపులో పెట్టుకోకపోతే వారే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ కుమార్తె కనిపించడం లేదని ఓ తండ్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సింగ్‌నగర్ పైపుల రోడ్డు సమీపంలో నివసిస్తున్న గోవిందరాజన్ శివకుమార్ పెద్ద కుమార్తె యశశ్రీ (21) ఇంటర్మీడియట్ వరకూ చదువుకొని ఇంటి వద్దే ఉంటుంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి ఆమె ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో భయాందోళనకు గురైన వారు తమ బంధువులు, కుమార్తె స్నేహితులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఫిబ్రవరి 7 నుంచి దత్తసాయి మందిర వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట దత్తసాయి మందిరంలో వచ్చే నెల 7వ తేదీ నుంచి 9 వరకు వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు తెలిపారు. వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ గురువారం మందిర ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీ మంగళవారం ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు విఘ్నేశ్వరపూజ, బాబావారికి అభిషేకం చేస్తామని పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయి అఖండ తారక నామ పారాయణం చేస్తామన్నారు. 8వ తేదీ బుధవారం మధురానగర్ పుర వీధులలో సాయి భక్తులచే సాయిబాబా భిక్ష సేకరణ , విష్ణు, లలితా సహస్రనామ పారాయణం చేస్తామని పేర్కొన్నారు. 9వ తేదీ గురువారం బాబావారికి 21 దివ్య ద్రవ్యములతో అభిషేకం, అన్నాభిషేకం సాయినక్షత్రమాలిక 10వ మహాయజ్ఞంలో 54వ పర్వం పారాయణం, సంకీర్తన, లోక కళ్యాణార్థం లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. సాయత్రం 7 గంటలకు పల్లకీ సేవతో వార్షికోత్సవాలు ఘనంగా ముగుస్తాయని తెలిపారు. సాయి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.



వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తంగెళ్ళమూడి వీర మోహనరావు

నవజాత శిశువుకు పేస్ మేకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నవజాత శిశువు హృదయ స్పందన అబ్‌నార్మల్‌గా ఉండగా క్రమబద్ధీకరించేందుకు వైద్యులు తాత్కాలిక పేస్‌మేకర్ అమర్చారు. గర్భం దాల్చిన 29 వారాలకు జన్మించిన 900 గ్రాముల బరువున్న శిశువు రెండున్నర నెలల తర్వాత బరువు పెరగడంతో శాశ్వత పేస్‌మేకర్ అమర్చినట్లు వైద్యం అందించిన రెయిన్‌బో ఆస్పత్రి నియోనాటాలజిస్ట్ డాక్టర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని తమ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీ 27వ వారంలో పరీక్షకోసం రాగా, ఫీటల్ నిపుణురాలు డాక్టర్ సుమలత పరీక్షించి గర్భస్థ శిశువు హార్ట్‌బీట్‌లో తేడా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రెండు వారాల తర్వాత హృదయ స్పందన తేడా రావడంతో అత్యవసరంగా సిజేరియన్ చేయగా, కవలలకు జన్మనిచ్చినట్లు తెలిపారు. వారిలో 900 గ్రాముల బరువున్న శిశువుకు తాత్కాలిక ఫేస్‌మేకర్ అమర్చి హార్ట్ రేట్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. రెండున్నర నెలలకు 3 కిలోలకు బరువు పెరగడంతో శాశ్వత ఫేస్‌మేకర్ అమర్చి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి వైద్యులు ఉమా మిక్కిలినేని, డాక్టర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ భరత్‌సిద్దార్థ్, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆటోనగర్(విజయవాడ తూరు): ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన భారతీనగర్ సమీపంలోని హైటెన్షన్ రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రామవరప్పాడుకు చెందిన మోడే నికిల్, యనమలకుదురుకు చెందిన వంగపండు వాసవి తీవ్రంగా గాయపడ్డారు. నికిల్ తన బైక్‌పై భారతీనగర్ హైటెన్షన్ రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో వస్తుండగా ఇదే దారిలో మహానాడు రోడ్డు నుంచి వాసవి అనే మహిళ వస్తున్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

క్రీడాశాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించం

విజయవాడ స్పోర్ట్స్: నిరాధారమైన ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)పై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని, అలాంటి వార్తా సంస్థలపై న్యాయపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శాప్ వీసీ, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడా శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా పత్రికల్లో (సాక్షి కాదు) ప్రచురించిన వార్తలను ఆయన ఖండించారు. కార్యాలయంలోని మహిళా ఉద్యోగులను అధికారులు లైంగికంగా వేధిస్తున్నారంటూ వెలువడిన వార్తలో వాస్తవం లేదన్నారు. ఆకాశ రామన్న ఉత్తరాలతో క్రీడాశాఖపై నిందలు మోపుతూ వార్తలు ప్రచురించడం ఏ మాత్రం తగదన్నారు. శాప్ కార్యాలయంలో గతంలో అవినీతి అక్రమాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని గుర్తు చేశారు. దీనిని పక్కదారి పట్టించేందుకు కార్యాలయంలోని అవినీతి అధికారులకు క్రీడా సంఘం ముసుగులో ఉన్న ఓ వ్యక్తి కుమ్మక్కై ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే ఈ అసత్య ప్రచారాలకు ఒడిగట్టారని వెల్లడించారు. గతంలోనూ కబడ్డీ జట్ల ఎంపికను సదరు క్రీడా సంఘం నాయకుడు పిచ్చి ఆరోపణలతో తన స్వలాభం కోసం పక్కదారి పట్టించేందుకు ఇదే మీడియా సంస్థను వాడుకున్నారని గుర్తు చేశారు. నిజానిజాలు పరిశీలించుకోకుండా వార్తలను ప్రచురించి తమ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించిన సదరు మీడియా సంస్థ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.